

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

# రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ విఫలం

- ప్రజలకు రక్షణ లేకుండా పోయింది
- వరంగల్ అభివృద్ధిపై విజన్ లేని ప్రభుత్వం
- ఇక నుంచి కాంగ్రెస్ సర్కారుపై తిరుగుబాటే
- బీఆర్ఎస్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి

హనుమకొండ, జూలై 12 : రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ అమలు విషయంలో కాంగ్రెస్ సర్కారు విఫలమైందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ చైర్మన్లు నాగుర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవరెడ్డిలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొన్ని రోజులుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో హత్యలు, మానభంగాలు, పోలీస్ వేధింపులు అధికమయ్యాయని అన్నారు. రాష్ట్రంలో హోంశాఖకు మంత్రి లేకపోవడం దురదృష్టకరమన్నారు. శాంతి భద్రతల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతోనే యువత పెడదారి పడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. చెన్నారావుపేట మండలంలోని 16 చింతల తండాలో జరిగిన గిరిజన తల్లిదండ్రుల హత్యోదంతం దారుణమని, ఈ విషయంలో పోలీసు అధికారులు సరిగా స్పందించలేదన్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కూడా పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రంలో సామాన్య ప్రజలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఈ నెల 16న సీఎం కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిసిందని, రాష్ట్రంలో జరుగుతున్న నేరాలపై సమీక్షించాలని బీఆర్ఎస్ తరపున డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నుంచి జిల్లాలో ఇద్దరు మంత్రులు, 10 మంది ఎమ్మెల్యేలుండగా, 11వ నంబర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రవర్తన వేరుగా ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు రూ.1600 కోట్ల అభివృద్ధి నిధులు తీసుకొచ్చామని, ఈ ఏడు నెలల పాలనలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎన్ని నిధులు తీసుకొచ్చారని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించి ప్రగతిలో ఉన్న పనులను ఆపివేయడంతో పాటు టెండర్ కాని వాటిని రద్దు చేస్తున్నారని పెద్ది ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులను వేధించడం, వారిపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేయడం, కాంగ్రెస్‌లోకి లాక్కోవడంపై దృష్టిపెట్టిన ప్రభుత్వం పాలనను పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేసారు. తొర్రూరులో జరిగిన ఘటన ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎక్కడ జరిగినా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలంతా మూకుమ్మడిగా అక్కడికి వెళ్తామన్నారు. అలాగే ఇక నుంచి కాంగ్రెస్ పార్టీ హామీలపై ప్రశ్నిస్తూ తిరుగబాటు చేస్తామని పెద్ది పేర్కొన్నారు.

**విజన్ లేని ప్రభుత్వం**

ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వానికి విజన్ లేదని పెద్ది ఆరోపించారు. ఇప్పటికే గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని, ఆస్పత్రుల పరిస్థితి అధ్వానంగా ఉందని, డెంగీ లాంటి విష జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికార పార్టీ నాయకులు గ్రామాల్లో లేని సమస్యలు సృష్టిస్తున్నారని అన్నారు. ఇక నుంచి అధికార పార్టీ ఇచ్చిన హామీలపై రోజుకొక పోస్టు సోషల్ మీడియాలో పెడతామని, ఇందుకోసం శ్రేణులకు ప్రత్యేక శిక్షణ ఇస్తామని తెలిపారు. అలాగే ప్రతి హామీపై ప్రశ్నిస్తామని, ఎంత మందిపై థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తారో చూస్తామని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ పాలనలో రౌడీ షీటర్స్ నగరానికి దూరంగా ఉంటే.. నేడు వారు ఖద్దరు చొక్కాలతో తిరుగుతున్నారని, ఇదే వరంగల్‌లో వచ్చిన మార్పు అన్నారు. కేసీఆర్ కుటుంబంతోనే బీఆర్ఎస్ అవినీతిమయంగా మారిందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆరోపించారని, అదే నిజమైతే కడియం శ్రీహరి కూడా అందులో భాగమైనట్లు ఒప్పుకున్నట్లే కదా అని అన్నారు. జీవితంలో కాంగ్రెస్‌కు ఓటు వేయన్న శ్రీహరి, మొన్నటి ఎంపీ ఎన్నికల్లో సైతం తన బిడ్డకు ఓటు వేయనట్లు ఉన్నాడని చెప్పారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజల తరపున కొట్లాడుతామని, కేసులను ఎదుర్కొంటామని సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. సమావేశంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, కార్పొరేటర్లు చెన్నం మధు, బోయినపల్లి రంజిత్‌రావు, మైనార్టీ నాయకుడు నయీముద్దీన్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, మిట్టపల్లి రమేశ్, బైరపాక ప్రశాంత్ పాల్గొన్నారు.

# టాస్క్‌ఫోర్స్ ఆకస్మిక దాడులు



టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

- పరకాలలో 360 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, రూ.1.58 లక్షల విలువైన గుట్కాలు స్వాధీనం
- నలుగురి అరెస్ట్

పరకాల, జూలై 12 : పరకాల ఉమ్మడి మండల వ్యాప్తంగా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద మొత్తంలో పీడీఎస్ బియ్యాన్ని, పొగాకు ఉత్పత్తులను పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పరకాల పట్టణం, నడికూడ మండలంలోని చర్లపల్లి గ్రామంలో అక్రమ వ్యాపారం నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు స్థానిక పోలీసులతో కలిసి దాడులు నిర్వహించారు. నడికూడ మండలం చర్లపల్లిలో నిర్వహించిన దాడుల్లో రూ.9.5లక్షల విలువ చేసే 360 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని, డీసీఎంను స్వాధీనం చేసుకుని, నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో తూర్పాటి ఐలయ్య, నడికూడ మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన బండి శంకర్, బండి కుమార్‌తో పాటు పరకాల మండలం కామారెడ్డి పల్లి గ్రామానికి చెందిన కొమ్మిడి మధూకర్ రెడ్డి ఉన్నారు. దీంతో పాటు రూ.1.58లక్షల విలువ చేసే గుట్కాలను రేపాల చంద్రశేఖర్ గుప్తా నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాగా, స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని, పొగాకు ఉత్పత్తులను, డీసీఎంను స్థానిక పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ తెలిపారు.

# బహుళ విభాగాల పరిశోధనలు తప్పనిసరి

- నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి
- మూడురోజుల జాతీయ సదస్సు ప్రారంభం

హనుమకొండ చౌరస్తా, జూలై 12 : జాతీయ విద్యా విధానం బహుళ విభాగాల పరిశోధనలను తప్పనిసరి చేస్తున్నదని నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి అన్నారు. 6వ ఇండియన్ కాన్ఫరెన్స్ ఆన్ అప్లైడ్ మెకానిక్స్(ఐఎన్‌సీఏఎం-24) శుక్రవారం నిట్‌లోని అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో ప్రారంభమైంది. ప్రొఫెసర్ జేఎన్ రెడ్డి (టెక్సాస్ ఎ అండ్ ఎం యూనివర్సిటీ, యూఎస్ఏ), ప్రొఫెసర్ ఏఎం రాజేంద్రన్ (మిసిసిపీ విశ్వవిద్యాలయం, యూఎస్ఏ), ఐఎన్‌సీఏఎం ప్రెసిడెంట్ ప్రొఫెసర్ లక్ష్మణరావు, నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యధర్ సుబుధి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సదస్సు సారాంశాల పుస్తకాన్ని అతిథులు విడుదల చేశారు. మూడు రోజుల పాటు జరిగే సదస్సులో ప్రతినిధులు 200 పరిశోధన పత్రాలను సమర్పించనున్నారు. ప్రొఫెసర్లు తేజెస్వీ, హెచ్‌పీ రాణి, కే శ్రీకాంత్, అజయ్‌కుమార్ పటేల్ పాల్గొన్నారు.



మల్లారెడ్డిపల్లిలో వరినాట్లు వేస్తున్న మహిళలు



# వానలు లేక.. ఎవుసం సాగక

ఉమ్మడి జిల్లాలో సాధారణ వర్షాలే ▪ ఊపందుకోని పంటల సాగు

వానలు లేక.. ఎవుసం సాగక అన్నదాత కుదేలవుతున్నాడు. చెరువులు నిండక, ప్రాజెక్టుల నుంచి నీరు రాక ఇబ్బందులు పడుతున్నాడు. వరినాట్ల అదును మొదలైనా.. నారు సిద్ధంగా ఉన్నా.. నాటు వేయలేని దుస్థితి నెలకొంది. అడపా దడపా కురిసిన వర్షాలకు వాణిజ్య పంటల సాగు జోరందుకున్నా.. ప్రధాన ఆహార పంటైన వరికి మాత్రం ప్రతికూల పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటి వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగులో మాత్రమే మెరుగైన వర్షపాతం నమోదు కాగా, మిగిలిన జిల్లాల్లో సాధారణంగానే ఉంది. సీజన్ ప్రారంభమై 42 రోజులు గడిచినా ఒక్క భారీ వర్షం కూడా నమోదు కాలేదు. అక్కడక్కడా బోర్లు, బావుల కింద రైతులు నాట్లు వేస్తున్నారు. మరో రెండు వారాల్లో వానలు పడకుంటే నారు ముదురుతుందని, ఆ తర్వాత కురిసినా ఫలితం ఉండదని అన్నదాతలు వాపోతున్నారు.

- వరంగల్, జూలై 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

- రెండుసార్లు మొలకెత్తని పత్తి గింజలు
- మొదలైన వరి నాట్ల అదును
- ఇప్పటికీ నీళ్లు రాని పరిస్థితి
- వరి సాగుకు ప్రతికూలతలు

**వానకాలం సీజన్‌లో వర్షపాతం (మిల్లీ మీటర్లలో)**

| జిల్లా | సాధారణం | కురిసింది | తేడా(శాతం) |
|---|---|---|---|
| వరంగల్ | 220 | 244 | 10.7 ఎక్కువ |
| హనుమకొండ | 226 | 250 | 10.6 |
| మహబూబాబాద్ | 204 | 241 | 18.1 |
| ములుగు | 284 | 347 | 22.1 |
| జయశంకర్ భూపాలపల్లి | 247 | 234 | - 4.9 |
| జనగామ | 187 | 216 | 15.4 |

బైరాన్‌పల్లిలో పత్తిచేనుకు మందు పిచికారీ చేస్తున్న రైతు



పంటల సాగుకు రెండో ఏడాదీ ప్రతికూలంగా ఉన్నట్లు కనిపిస్తున్నది. ఈసారి కూడా సాధారణ వర్షపాతమే నమోదవుతున్నది. వానలు తక్కువగా ఉండడం, ప్రాజెక్టుల నుంచి నీటి సరఫరా లేకపోవడంతో సాగు సరిగా సాగడంలేదు. ఉమ్మ డి వరంగల్ జిల్లాలో అన్ని పంటల సాగు పరిస్థితి ఇలాగే ఉంది. వానకాలం సీజన్ మొదలైన జూన్ 1 నుంచి జూలై 12 వరకు మహబూబాద్ జిల్లాలో 1.54 లక్షల ఎకరాల్లో, వరంగల్‌లో 1.43 లక్షలు, జనగామలో 1.12 లక్ష లు, జయశంకర్ భూపాలపల్లిలో 91 వేలు, హ నుమకొండలో 84 వేలు, ములుగు జిల్లాలో 18 వేల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. సాధారణ పంటల సాగు విస్తీర్ణం కంటే ఈసారి అన్ని పంటలు తక్కువగానే సాగయ్యాయి.

**వరికి అడ్డంకులు..**

వానకాలంలో వరి ప్రధాన పంటగా ఉంటుంది. ఎక్కువ విస్తీర్ణంలో ఈ పంటను సాగు చేస్తా రు. నీటి వినియోగం అధికంగా ఉండే పంట ఇది. వరుసగా రెండో ఏడాది కూడా సాగునీటి ప్రాజెక్టుల నుంచి నీటి సరఫరా లేకపోవడంతో వరి విస్తీర్ణంపై ప్రతికూల ప్రభావం పడుతున్నది. గత ఐదారేండ్లలో ఎన్నడూ లేనంత తక్కువ విస్తీర్ణంలో ఈ పంట వేసే పరిస్థితి కనిపిస్తున్నది. ప్రస్తుతం వరి నాట్ల అదును మొదలుకాగా, నా రు సిద్ధంగా ఉన్నది. సాగునీరు లేకపోవడంతో పొలాలు దున్నేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బోర్లు, బావులు ఉన్నవారు నాట్లు వేస్తున్నారు. మరో రెండు వారాల్లోపు సాగునీరు అందకపోతే నారు ముదిరిపోతుంది. ఆ తర్వాత వానలు కురిసినా ఫలితం ఉండదు. వరి విస్తీర్ణం తగ్గితే బియ్యం ఉత్పత్తిపై ప్రభావం పడనున్నది.

**పత్తి రైతుకు దెబ్బ..**

వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, జనగామ జిల్లాల్లో రెండో ప్రధాన పంటగా పత్తి ఉంటున్నది. ఈసారి పత్తి రైతుకు విత్తన ఖర్చులు భారీగా అయ్యాయి. తొలకరి వానలు కురవగానే ఎన్నో ఆశలతో పత్తి విత్తనాలు నాటారు. ఆ తర్వాత వానలు పడక, ఎండలు బాగా ఉండడంతో విత్తనాలు మొలకెత్తలేదు. కొద్దిపాటి వానల తర్వాత రెండోసారి విత్తనాలు పెట్టారు. ఈసారి కూడా విత్తనాలు భూమిలోనే పోయాయి. వానలకు అనుగుణంగా రైతులు మూడు నాలుగు సార్లు పత్తి గింజలు పెట్టాల్సి వచ్చింది. ప్రతికూల పరిస్థితిలో మొలిచిన మొక్కలు ఆశించిన మేరకు పెరగడంలేదు. వీటిని కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

**పంటల సాగు (ఎకరాల్లో)**

| జిల్లా | సాధారణం | సాగైంది |
|---|---|---|
| వరంగల్ | 1,52,746 | 1,43,692 |
| హనుమకొండ | 64,294 | 84,023 |
| మహబూబాబాద్ | 1,37,460 | 1,54,071 |
| ములుగు | 45,557 | 18,633 |
| జయశంకర్ భూపాలపల్లి | 1,12,742 | 91,866 |
| జనగామ | 1,37,859 | 1,12,460 |

**ప్రధాన పంటలైన పత్తి, వరి సాగు(ఎకరాల్లో)**

| జిల్లా | పత్తి | వరి |
|---|---|---|
| వరంగల్ | 1,14,242 | 1,560 |
| హనుమకొండ | 75,578 | 724 |
| మహబూబాబాద్ | 78,332 | 7,208 |
| ములుగు | 13,935 | 567 |
| జయశంకర్ భూపాలపల్లి | 85,940 | 114 |
| జనగామ | 94,425 | 10,115 |



పనులు పూర్తి కాకుండానే రంగులు వేసిన కస్తూర్బాగాంధీ పాఠశాల బిల్డింగ్

# పైన పటారం.. లోన లొటారం..

- పనులు పూర్తికాని ముప్పనపల్లి కేజీబీవీ
- నేడు ప్రారంభించనున్న మంత్రి సీతక్క

రంగులతో అందంగా కనిపిస్తున్న ఈ భవనం కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలది. దీనిని ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని ముప్పనపల్లిలో కొత్తగా నిర్మించారు. జీ ప్లస్ టూతో దీనిని చేపట్టగా ఇంకా నిర్మాణ దశలోనే ఉంది. గ్రౌండ్, మొదటి అంతస్తులో పనులు పూర్తి చేసినప్పటికీ రెండో అంతస్తును మాత్రం అలాగే వదిలేశారు. పూర్తయిన గదుల్లో బెంచీలు, బెడ్స్ లేవు. కనీసం విద్యార్థుల సామగ్రి భద్రపర్చుకునేందుకు ఏర్పాట్లు చేయలేదు. సీలింగ్ ఫ్యాన్లు కూడా సరిగా లేవు. పాఠశాలకు కాంపౌండ్ వాల్‌తో పాటు గేట్ ఏర్పాటు చేయలేదు. కానీ, అధికారులు మాత్రం పాఠశాల ముందు భాగాన్ని ముస్తాబు చేసి శనివారం మంత్రి సీతక్కతో ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యార్థినుల నుంచి ఉపాధ్యాయుల వరకు అందరూ మహిళలే ఉండే ఈ పాఠశాలను అరకొర వసతులతో ప్రారంభించొద్దని, మంత్రి సీతక్క ఈ విషయమై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

- కన్నాయిగూడెం, జూలై 12



రెండో ఫ్లోర్‌లో అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులు

# కలెక్టరేట్లను ముట్టడించిన విద్యార్థులు

- విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ నేతృత్వంలో ఆందోళన
- సమస్యలు పరిష్కరించాలని నినదించిన నేతలు
- జనగామలో ఉద్రిక్తత



జనగామ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు



విద్యార్థులను అడ్డుకుంటున్న పోలీసులు

జనగామ (నమస్తేతెలంగాణ), హనుమకొండ, భూపాలపల్లి రూరల్/ఖిలావరంగల్, జూలై 12 : విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ నేతృత్వంలో శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించారు. జనగామ, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్ కలెక్టరేట్లను ముట్టడించారు. జనగామ కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు విద్యార్థి నేతలు యత్నించారు. ఈ సందర్భంగా పోలీసులు, విద్యార్థులకు మధ్య తోపులాట జరగడంతో కొద్దిసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జనగామ జిల్లా కార్యదర్శి ధర్మబిక్షం మాట్లాడుతూ విద్యార్థులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నదని విమర్శించారు. పెండింగ్ స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు డీఎస్సీపై అనేక మాటలు చెప్పిన రేవంత్‌రెడ్డి, ఇప్పుడు వాయిదా వేయాలని ఆందోళన చేస్తున్న నిరుద్యోగులను నిర్బంధిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే అసెంబ్లీతోపాటు సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు.

# సౌకర్యాలు కల్పించాలి

భూపాలపల్లిలో పాఠశాల విద్యార్థుల ధర్నా

కృష్ణకాలనీ, జూలై 12 : సరైన సౌకర్యాలు లేక జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని భూపాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం రోడ్డెక్కారు. మరుగుదొడ్లు, సరిపడా ఉపాధ్యాయులు లేక ఇబ్బంది పడుతున్నామని జిల్లా కేంద్రంలోని జయశంకర్ సెంటర్‌లో జాతీయ ప్రధాన రహదారిపై ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు చెందిన తాము ప్రభుత్వంపై నమ్మకంతో భూపాలపల్లి జడ్పీహెచ్ఎస్‌కు వస్తున్నామని, కానీ, ప్రభుత్వం సరైన సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. మరుగుదొడ్లు లేక కాలకృత్యాల కోసం బయటికి వెళ్లాల్సి వస్తున్నదన్నారు. విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేక, నాణ్యమైన విద్య అందక ఆగమైపోతున్నామన్నారు. అనంతరం భూపాలపల్లి ఇన్‌చార్జి ఎంఈవో రఘుపతి ధర్నా వద్దకు వచ్చి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో విరమించారు.



భూపాలపల్లిలోని జయశంకర్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న విద్యార్థులు

# కక్ష పెంచుకుని ఘాతుకం

- దంపతులను హత్య చేసిన ప్రేమోన్మాది అరెస్ట్
- తల్వార్, కత్తులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీసీపీ రవీందర్

నర్సంపేట, జూలై 12: ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను తన నుంచి విడగొట్టి, మరొకరికిచ్చి వివాహం జరిపించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని కక్ష పెంచుకుని దీపిక కుటుంబంపై నాగరాజు ఘాతుకానికి పాల్పడినట్లు డీసీపీ రవీందర్ తెలిపారు. నర్సంపేట పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గుండెంగ గ్రామానికి చెందిన మేకల నాగరాజు అలియాస్ బన్నీ, వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం 16 చింతలతండా గ్రామంలోని దీపిక ప్రేమించుకున్నారు. 2023 నవంబర్‌లో ప్రేమ వివాహం చేసుకోగా విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు సుగుణ, శ్రీనివాస్ సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కేసు నమోదు చేసిన పోలీసులు ఇద్దరిని స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. తాను నాగరాజుతోనే వెళ్తానని పోలీసుల ఎదుట దీపిక చెప్పింది. కొంతకాలం దీపిక, నాగరాజు హైదరాబాద్‌లోనే ఉన్నారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో దీపిక తల్లిదండ్రులతో ఉంటోంది. ఈ నేపథ్యంలో దీపికను తన నుంచి దూరం చేశారని ఆమె తల్లిదండ్రులపై నాగరాజు కక్ష పెంచుకున్నాడు. హైదరాబాద్ నుంచి ఐదు నెలల క్రితం గుండెంగకు వచ్చిన నాగరాజు ఆటోను అద్దెకు తీసుకుని నడుపుతున్నాడు. నెలరోజుల క్రితం నెక్కొండలో కత్తిని కొనుగోలు చేశాడు. మరో కత్తి ఆన్‌లైన్‌లో కొనుగోలు చేశాడు. ఈ నెల 11న రాత్రి ఒంటి గంట సమయంలో 16చింతలతండాకు చేరుకొని ఆరుబయట రేకుల షెడ్ కింద నిద్రిస్తున్న దీపికపై దాడి చేయపోగా ఆమె చేతులు అడ్డం పెట్టడంతో గాయాలయ్యాయి. వెంటనే పక్కనే ఉన్న తల్లి సుగుణ, తండ్రి శ్రీనివాస్‌పై విచక్షణా రహితంగా కత్తితో దాడి చేశాడు. దీంతో తల్లి అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం దీపిక తమ్ముడు మదన్‌లాల్ మెడపై కూడా దాడి చేశాడు. వారి అరుపులు విన్న స్థానికులు ఘటనా స్థలానికి చేరుకొని నాగరాజును వారించబోగా అక్కడి నుంచి పరారయ్యాడు. వెంటనే శ్రీనివాస్‌ను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. నెక్కొండ సీఐ, ఎస్సై ఆధ్వర్యంలో టీంలుగా ఏర్పడి నిందితుడిని వడ్డేపల్లి జంక్షన్ వద్ద పట్టుకున్నారు. మృతుడి తల్లి బానోత్ ఈరమ్మ ఫిర్యాదుతో మేకల నాగరాజు అలియాస్ బన్నీపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ వెల్లడించారు. సమావేశంలో ఏసీపీ కిరణ్‌కుమార్, నెక్కొండ సీఐ చంద్రమోహన్ పాల్గొన్నారు.




వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రవీందర్